రైతులతోనే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం

- అధికార దాహంతోనే అడ్డగోలు హామీలు
- బోనస్ దగాతో కాంగ్రెస్ మోసానికి పరాకాష్ట
- మాజీ మంత్రి పాన్నాల

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రైతులతోనే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పాన్నాల లక్ష్మయ్య స్పష్టం చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, ఇప్పుడు వాటన్నింటికీ కొర్రీలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకే బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి ఉంటే అప్పుడు రైతులు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేవారని తెలిపారు. ఓట్లు దండుకోవడం కోసమే సీఎం రేవంత్ లోక్‌సభ ఎన్నికల్లోనూ బోనస్ మాట చెప్పారని తీరా అమలుకు వచ్చే సరికి సన్న వడ్లకే అని షరతులు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. తడిసిన ధాన్యం కుప్పల వద్దకు మంత్రులు వెళ్లనేలేదని, ఎన్నికల ప్రచారానికి ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి సమయముంది కానీ రైతుల వద్దకు వెళ్లడానికి లేదా అని ప్రశ్నించారు. తడిసిన వడ్లను ఇప్పటివరకు ఒక్క కిలో కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని, అవి కాస్తా మొలకెత్తాయని వాటి సంగతేంటి అని పేర్కొన్నారు. రైతుబంధు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్న అంశంపై మంత్రిమండలి సమావేశంలో చర్చ జరిగిందా అని ప్రశ్నించారు. తమ అవసరాల కోసమే క్యాబినెట్ మీటింగ్ పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలు, రైతులు బుద్ధి చెప్తారని తెలిపారు. రైతుబంధు ఎప్పుడు ఇవ్వాలో ప్రభుత్వానికి తెలియడమే లేదని ఎద్దేవా చేశారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, సాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

పండని పంటకు బోనస్!

మొదటిపేజీ తరువాయి...

రైతులు కూడా ఎన్నికల్లో తమ నిర్ణయాన్ని చెప్పి ఉండేవారని పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తికాగానే సన్నవడ్లకే బోనస్ అని ప్రకటించి రైతులను దగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అన్ని రకాల పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తామని చెప్పడం ఆ పార్టీ మోసానికి పరాకాష్ట అని మండిపడ్డారు. వానకాలంలో కూడా 20 శాతం మాత్రమే సన్నవడ్లు పండిస్తారని, యాసంగిలో పండేదే దొడ్డువడ్లు అని, పండని సన్నవడ్లకు బోనస్ ఇస్తామనడం మోసం కాదా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మెజార్టీ రైతులు పండించేది దొడ్డు రకాలేనని చెప్పారు. నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత లేదన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాహుల్, ప్రియాంక కూడా అదే అన్నారు

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో సన్నవడ్లకే బోనస్ అని ఎక్కడా చెప్పలేదని, అలా ఉంటే చూపించాలని సవాలు విసిరారు. రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కూడా వరికి బోనస్ అనే చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. వారి మాటల వీడియోను మీడియా ఎదుట ప్రదర్శించారు. వడ్లకు బోనస్ విషయంలో ప్రభుత్వాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. బకాయి పడిన రూ. 2,500, వానకాలం పంటకు ఇచ్చే రూ. 7,500 కలిపి జూన్ లోపల రూ. 10 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సన్నవడ్లతో బోనస్ మొదలు పెడతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చెప్పారని, దొడ్డువడ్లకు ఎప్పటి నుంచి బోనస్ ఇస్తారో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం జొన్న, మిరప, పసుపు, సోయాబీన్, ఎర్రజొన్న ఇతర పంటలకు కూడా ప్రకటించిన ధరలు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు.

వడ్ల కొనుగోలులో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు 36 లక్షల టన్నుల వడ్లు మాత్రమే కొనుగోలు చేసిందని, మరో వారం పదిరోజుల్లో సీజన్ అయిపోతుందని, ఆ లోపు 30 లక్షల టన్నుల ధాన్యం కొనే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సన్న బియ్యం వ్యవహారంలో ప్రభుత్వ కొనుగోలు విధానం సరిగా లేదని ఆక్షేపించారు. వడ్ల కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నాలుగైదు కిలోలు తరుగు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భూసారం పెంచే జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలను కూడా ప్రభుత్వం సరఫరా చేయలేకపోతున్నదని, విత్తనాల కోసం కూడా రైతులు క్యూలు కడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జూన్‌లో రైతుబంధు నిధులు ఇవ్వాలని, వడగండ్ల వాన, అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు.

తడిసిన వడ్లను కొంటలేరు

మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలం ముత్తాయికోట గ్రామానికి చెందిన రైతు తడిసిన ధాన్యాన్ని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని రైస్ మిల్లుకు పంపిస్తే అక్కడ కొనుగోలు చేయడం లేదని మాజీమంత్రి హరీశ్‌రావు తెలిపారు. రైస్‌మిల్లుకు ధాన్యం తీసుకెళ్లిన లారీ డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డితో మీడియా సమావేశంలోనే ఆయన ఫోన్‌లో మాట్లాడారు.

హరీశ్‌రావు: ప్రభాకర్‌రెడ్డిగారు మీరు ధాన్యాన్ని ఎక్కడి నుంచి ఎప్పుడు, ఎక్కడికి తీసుకెళ్లారు?

డ్రైవర్: సార్... నేను ఆదివారం అర్ధరాత్రి మెదక్ దగ్గర ముత్తాయికోట నుంచి సోమవారం తెల్లారిగట్ల బెజ్జంకి రైస్ మిల్లుకు ధాన్యం తీసుకొచ్చా సార్.

ధాన్యం దించుకున్నరా?

లేదు సార్. ఇంకా దించుకోలేదు. ఇంతకు ముందు మీరు ఫోన్ చేసినంత వరకు ఎవరు చూడలేదు. ఇప్పుడు వచ్చి బొమ్మ వేశారు. ఆ తరువాత ఏం చెప్పలేదు.

ఇంతకుముందు తడిసిన ధాన్యం కొనేది లేదన్నారని అన్నావు కదా?

అవును సార్ కరెక్టే. ఇంతకు ముందే వచ్చి బొమ్మ కొట్టిపోయారు. మళ్లీ ఎం చెప్పలేదు.

నీకు భోజనం, ఉండడం, ఎలా?

హోటల్‌లో తింటున్నాను సార్.

భోజనానికి డబ్బులు ఎవరు ఇచ్చారు?

సెంటర్ వాళ్లు రూ.500 ఇచ్చారు. మూడు రోజులు ఇక్కడే అయితదని డబ్బులు ఇచ్చారు సార్.

ధాన్యం దించుకోకుంటే చెప్పండి.

లారీకి 50 బస్తాల తరుగు తీస్తేనే కొంటాం

రైతు సంతోష్‌కు కొనుగోలు కష్టాలు

ఐదు రోజులైనా వడ్లుకొనని అధికారులు

'ఎక్స్'లో బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): వడ్ల కొనుగోలులో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి మెదక్ జిల్లాకు చెందిన సంతోష్ అనే రైతు కష్టాలే నిదర్శనమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు 'ఎక్స్' ద్వారా తెలిపారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పులిమామిడి కిష్టాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ సిద్దిపేట జిల్లా గాగులాపూర్ అన్నపూర్ణ రైస్ మిల్లుకు ఐదు లారీలు వడ్లు పంపారని, ఐదు రోజులైనా ప్రభుత్వం కొనడం లేదని, అధికారులు జాప్యంతో ధాన్యం మొలకెత్తిందని పేర్కొన్నారు. మొలకెత్తిన ధాన్యాన్ని కొనడం సాధ్యంకాదని, తిరిగి తీసుకెళ్లాలని చెప్తున్నారని హరీశ్‌రావు ఆ పోస్టులో పేర్కొన్నారు. అధికారుల కాళ్లావేళ్లా పడితే లారీకి 50 బస్తాల తరుగు తీస్తేనే కొంటామని చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐదు రోజులుగా డ్రైవర్లకు భోజన వసతి సదుపాయాల ఖర్చును సంతోష్‌తో పాటు గ్రామస్తులు భరిస్తున్నారని, మొలకెత్తిన వడ్లను కొంటామని ప్రభుత్వం చెప్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదని మండిపడ్డారు. సంతోష్ తనకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశారని, మెదక్, సిద్దిపేట కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి సంతోష్ సమస్యను పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు.

సన్న వడ్లతో బోనస్ ప్రారంభం

- ఎన్నికలకు ముందు ఏం చెప్పామన్నది ముఖ్యం కాదు
- గత ప్రభుత్వం కంటే అన్నింట్లో మెరుగ్గా ఉన్నాం
- మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎన్నికల ముందు హామీపై సమాధానం దాటవేత

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. గాంధీభవన్‌లో మంగళవారం పాత్రికేయులు ఈ విషయమై గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు వడ్లు పండించే రైతులందరికీ బోనస్ ఇస్తామని చెప్పి, ఎన్నికలు ముగియగానే మాట మార్చడంపై ప్రశ్నించగా.. ఆయన సమాధానం చెప్పకుండా దాటవేశారు. సన్న వడ్లకే బోనస్ అని అనలేదని, బోనస్ సన్న వడ్లతో మొదలు పెడతున్నామని స్పష్టం చేశారు. అప్పుడు తాము ఏం చెప్పామన్నది కాదు.. సన్న వడ్ల నుంచి బోనస్ ఇవ్వడం ప్రారంభిస్తున్నామని భట్టి సమర్థించుకున్నారు. గత ప్రభుత్వానికంటే మెరుగ్గా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కేవలం మూడు రోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని చెప్పా రు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ధా న్యం అమ్మాక నెలల తరబడి డబ్బుల కోసం రశీదులు పట్టుకొని అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతులు, వ్యవసాయం పట్ల కనబరుస్తున్న చిత్తశుద్ధి ప్రతిపక్షాలకు రుచించక రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.



గత ప్రభుత్వంతో పోలిస్తే యాసంగిలో కొనుగోలు కేంద్రాల ప్రారంభం, వాటి సంఖ్య, ధాన్యం సేకరణ, నగదు జమ చేసే అన్ని విషయాల్లోనూ తమ ప్రభు త్వం ముందంజలో ఉన్నదని చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం కంటే తామే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ, అబద్ధాలు చెప్పడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని విమర్శించారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని గత ప్రభుత్వం కొనలేదని, తాము దానికి కూడా కనీస మద్దతు ధర చెల్లించి కొంటామని చెప్పారు.

బోనస్‌పై కాంగ్రెస్ రోజుకో మాట

- మొన్న సన్న వడ్లకు బోనస్ అనలేదన్న కోదండరెడ్డి
- నేడు సన్నవడ్లకు ఇస్తే తప్పేంటని ఎదురుదాడి

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): సన్న వడ్లకు బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా అనలేదని ఇటీవల ఖండించిన కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి.. సన్న వడ్లకు బోనస్ ఇస్తే తప్పేమిటని తాజాగా ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. దొడ్డు బియ్యం ఎవరూ తినరు కాబట్టి సన్న వడ్లకు బోనస్ ఇస్తామంటే తప్పు ఎలా అవుతుందని ఎదురుదాడికి దిగారు. ఈ రోజుల్లో గ్రామాల్లో ఎవరైనా దొడ్డు బియ్యం తింటున్నారా? అని ప్రశ్నించారు. దొడ్డు వడ్లు కేవలం పశువులకు మేతకు వేస్తున్నారని వ్యాఖ్యానించారు. ధాన్యానికి మద్దతు ధర తోపాటు బోనస్ ఇస్తామని తమ పార్టీ చెప్పిన మాట వాస్తవమేనంటూ అంగీకరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల మీడియా చిట్‌చాట్‌లో సన్న వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. ఎన్నికల ముందు వడ్లు పండించే రైతులందరికీ బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడేమో సన్న వడ్లకే ఇస్తామని చెప్పడంపై రెండు రోజుల కిందట గాంధీభవన్‌లో పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు.. సీఎం ఆ మాట ఎక్కడా చెప్పలేదని కోదండరెడ్డి ఖండించారు. ఇదే అంశంపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా స్పందిస్తూ సీఎం అనని మాటలను అన్నట్టుగా మీడియా వక్రీకరించిందని పేర్కొన్నారు. సోమవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. దీంతో మొన్నటి దాకా అలా చెప్పలేదని ఖండిస్తూ వచ్చిన కాంగ్రెస్ నాయకులు తాజాగా సన్న వడ్లకు బోనస్ ఇస్తే తప్పేంటని అంటూ వాదనకు దిగారు. రుణ మాఫీ విషయంలోనూ ఇలాగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే డిసెంబర్ 9 కల్లా రూ.2 లక్షల వరకు రైతుల పంట రుణాలను మాఫీ చేసి తీరుతాం, ఎవరైనా రైతులు రుణం తీసుకోకపోతే తీసుకోండని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాట మార్చిన సంగతి తెలిసిందే..



మంగళవారం సూర్యాపేట జిల్లా నాగారంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

సన్నాలకే బోనస్‌పై బీఆర్ఎస్ కన్నెర

- రైతన్నకు అండగా మరోసారి ఉద్యమం
- పలు మండలాల్లో ధర్నాలు
- అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్
- పలు చోట్ల సీఎం రేవంత్ దిష్టిబొమ్మల దహనం

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

కరీంనగర్ నెట్‌వర్క్/బొమ్రాయిబజార్/దిలావర్‌పూర్/మందమర్రి రూరల్/జైపూర్, మే 21: ఎన్నికల ముందర రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించడంపై బీఆర్ఎస్ కన్నెర్ర జేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ.. అన్నదాతకు అండగా మరోసారి పోరుబాట పట్టింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పలు జిల్లాల్లోని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించడంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని అన్ని మండలాల్లో రైతులతో కలిసి రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. సన్నవడ్లకే కాదు, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడంతోపాటు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని, కరెంట్, కాళేశ్వరం నీళ్లు, పంట మొదట్లోనే రైతుబంధు ఇచ్చి ఆదుకున్నారని ఈ సందర్భంగా రైతులు గుర్తుచేసుకున్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాసేపు రైతులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన మాట అంతా బోగసేనని విమర్శించారు. ఇప్పటికైనా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని, లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా మంద మర్రి మండలం ఆదిలపేట్‌లో, జైపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేశ్ మాట్లాడుతూ సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామనడం బాధాకరమని పేర్కొన్నారు.

సిరిసిల్ల అర్బన్ మండలం నర్దాపూర్‌లోని మార్కెట్ యార్డు వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌లో ఏం చెప్పారు?

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిలదీత

జనగామ, మే 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అంటేనే మోసం.. ఆ పార్టీ నాయకులు చేస్తున్నదంతా దగా.. పూటకో మాట.. రోజుకో అబద్ధంతో పబ్బం గడుపుకొనే అసమర్థ పాలకులు తెలంగాణకు శనిలా పట్టారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జనగామలో మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నాడు సన్న వడ్లు, దొడ్డు వడ్లు అని వేర్వేరుగా అనలేదని, ఇప్పుడు సన్నవడ్లకే రూ.500 బోనస్ ప్రకటిస్తామనడం ఏమిటని నిలదీశారు.

బ్లాక్ లిస్ట్ సంస్థకు సన్నబియ్యం టెండర్లా?

- విచారించి టెండర్ రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది డిమాండ్

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది. చిత్రంలో రవీందర్‌సింగ్

హనుమకొండ, మే 21: ధాన్యం కొనుగోలు, సన్న బియ్యం టెండర్ల విషయంలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్‌తో కలిసి హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అర్హత లేకపోయినా వేల కోట్ల ధాన్యం టెండర్లను కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు, మధ్యాహ్నం భోజనం సన్న బియ్యం టెండర్లలో కాంగ్రెస్ పార్టీ, సీఎం, మంత్రులు చేతివాటాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఆరోపించినా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదంటే తప్పకుండా ఇందులో వారి ప్రమేయం ఉన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నదని తెలిపారు. గ్లోబల్ టెండర్ పేరుతో కోట్ల రూపాయల విలువ చేసే టెండర్లను 2025 మార్చి వరకు బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కేంద్రీయ బండార్ సంస్థకు అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని చెప్పారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న సంస్థకు టెండర్ ఇచ్చారంటేనే పెద్ద మొత్తంలో చేతులు మారినట్టు స్పష్టం అవుతున్నదని అన్నారు. ఇందులో గల్లీ నుంచి ఢిల్లీ వరకు వాటాలు వెళ్లాయని ఆరోపించారు. ఈ కుంభకోణం విషయాన్ని గురువారం సీఎస్‌కు, సివిల్ సప్లయీస్ కమిషనర్, డీఐజీ, ఐజీలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆధారాలతో సహా ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. రవీందర్‌సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్లోబల్ టెండర్ల పేరుతో సుమారు రూ.700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అనర్హులకు ఇచ్చిన టెండర్లను రద్దు చేయాలని, సివిల్ సప్లయీస్‌లో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

బోనస్‌పై రేవంత్‌వి బ్రోకర్ మాటలు

మాజీ మంత్రి ఎర్రబెల్లి

హనుమకొండ, మే 21: వడ్లకు బోనస్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ధాన్యాన్ని రూ.500 బోనస్‌తో కొనుగోలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించి నేడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని బోగస్ మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం హనుమకొండలో విలేకరులతో మాట్లాడారు. రైతులు ఎక్కువగా దొడ్డు వడ్లు పండిస్తారని, ఇంటి అవసరాల కోసం మాత్రమే సన్నవడ్లు సాగు చేస్తారని చెప్పారు. కేవలం 20 శాతం మేరకు సాగు అయ్యే సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చి దొడ్డు వడ్లకు ఇవ్వం అంటే తెలంగాణ రైతాంగాన్ని మోసం చేసినట్లేనని ఎర్రబెల్లి ఆరోపించారు.

రాష్ట్రంలో కొత్తగా 'యూ' ట్యాక్స్

- రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో రూ.950 కోట్ల కుంభకోణం
- కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్‌కు రూ.100 కోట్ల పార్టీ ఫండ్
- అఖిలపక్షం భేటీలో రుజువు చేస్తా
- బీజేపీఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి
- నిరాధార ఆరోపణలు: ఉత్తమ్

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో రూ. 950 కోట్ల కుంభకోణం జరిగిందని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతి బస్తాకు 2 నుంచి 4 కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని, ఇలా ఒక్కో క్వింటాల్‌కు 10 నుంచి 12 కిలోలు కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. 10-12 శాతం ఎక్కువగా తీసుకుంటున్న ధాన్యం మిల్లర్లకు చేరుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ఈ సీజన్‌లో 1.3 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని, ఈ లెక్కన 1300 టన్నుల ధాన్యాన్ని అధికంగా తీసుకుంటున్నట్టు అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఈ రశీదు లేని ధాన్యం మొత్తం విలువ సుమారు రూ.1600 కోట్లు అని తెలిపారు. ఇలా అధికంగా ధాన్యం ఇచ్చినందుకు మిల్లర్లు 'యూ' ట్యాక్స్ పేరు మీద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, అధికారులకు ఎంత ఇస్తున్నారని ప్రశ్నించారు. తనకు తెలిసిన సమాచారం ప్రకారం ఇటీవలే రూ. 500 కోట్లు చేతులు మారాయని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇందులో రూ. 100 కోట్లను కేసీ వేణుగోపాల్‌కు పార్టీ ఫండ్‌గా ఇచ్చారని ఆరోపించారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ కింద ప్రభుత్వానికి మొత్తం రూ.25వేల కోట్ల విలువైన బియ్యం రావాల్సి ఉన్నదని, బియ్యం మిల్లర్ల దగ్గర ఉంటే ప్రభుత్వం ఎందుకు వడ్డీ కడుతున్నదని ప్రశ్నించారు. మిల్లర్లు రూ.450 కోట్లు పోగు చేసి రశీదు లేని పన్ను కట్టారని ఆరోపించారు. గతంలో చేతులు మారిన రూ.500కోట్లు కూడా కలిపితే ఇది మొత్తం రూ.950 కోట్ల కుంభకోణమని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేస్తే రుజువు చేస్తానని చెప్పారు. రైస్ మిల్లర్లకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం.. మిల్లర్లు సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన బియ్యంపై వివరాలు ఇవ్వాలని కమిషనర్ చౌహాన్‌ను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాఖల వారీగా ఎవరికి వారు టోల్ గేట్లను ఏర్పాటు చేశారని మండిపడ్డారు.

ఆరోపణలు నిరాధారం

బీజేపీ ఎల్పీ నేత